క్లుప్తంగా

జాన్‌కు జీవిత సాఫల్య పురస్కారం



వెలుగు జాన్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

నిడదవోలు: సాంఘిక సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలుగు జాన్‌ను జీవిత సాఫల్య పురస్కారం లభించింది. పట్టణంలోని టౌన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి శాఖ ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఆశీర్వాదం, ఎం.రాఘవేంద్రరావు, డి. రాజాలాల్, కె.ఆనంద్, కె. చంద్రకళ, ఎం. రాజు, జి.వినోద్, ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నిడదవోలు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని గోపవరం సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, చిన్న నంగాలు దంపతుల ఆధ్వర్యంలో యువతకు శుక్రవారం క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆరేపల్లి దుర్గా శ్రీను, ఎ.ధనరాజు, ఎ.సత్తిబాబు, ముప్పిడి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు సమిశ్రగూడెం, నిడదవోలు జట్లు

ఉండ్రాజవరం: శశిధర్ మెమోరియల్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేలివెన్ను శశి విద్యా సంస్థల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ టోర్నీ సెమీ ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో సమిశ్రగూడెం జట్టు, నిడదవోలు జట్లు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. శనివారం ఉదయం జరిగే ఫైనల్స్‌లో ఈ రెండు జట్లూ తలపడతాయి.

నేడు అయ్యప్ప ఆలయంలో విశేష పూజలు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని అయ్యప్ప స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని మధ్యాహ్నం మూడు గంటల నుంచి పట్టణంలోని సత్యవతి నగర్‌లో సాయి తేజ గార్డెన్స్‌లోని పి.రమేష్ స్వామి స్వగృహం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు ఊరేగింపు జరుగుతుందన్నారు. సాయంత్రం 6.40 గంటలకు మకర జ్యోతి దర్శనాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కావున అయ్యప్ప భక్తులందరూ హాజరు కావాలని కోరారు.

స్వామిత్వ సర్వేతో కచ్చితమైన హద్దుల నిర్ధారణ

ఉండ్రాజవరం: స్వామిత్వ సర్వే ద్వారా స్థలాలు, భూమి యజమానులకు కచ్చితమైన హద్దులు ఏర్పడతాయని తహసీల్దార్ జి.కనకరాజు అన్నారు. డ్రోన్ల సాయంతో నిర్వహించే భూ సర్వేను మండలంలోని సత్యవాడ గ్రామంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 878 ఎకరాల సాగు భూమి, 262 ఎకరాల గ్రామకంఠం భూములను సర్వే చేస్తారన్నారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహించే ఈ సర్వే వలన రైతుల, స్థల యజమానుల పొలాలు, ఇళ్ల స్థలాల రికార్డులను కంప్యూటరీకరణ చేస్తామన్నారు. కార్యక్రమానికి రైతులు, ఇళ్ల యజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పద్మావతి, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు, మండల సర్వేయర్ నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు పింద్రా సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు ఐవీఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడతారా? .. అడ్డుకుంటారా?

- కోడి పందేలకు సిద్ధమవుతున్న బరులు
- జరగనివ్వబోమంటున్న పోలీసులు

దేవరపల్లి: అడ్డుకుంటామని ఒకరు.. ఆడి తీరతామని మరొకరు పంతం పట్టారు. ఏటా సంక్రాంతికి భోగి మంటలు, రంగవల్లులు, సంప్రదాయ క్రీడా పోటీలు ఒక ఎత్తయితే, రూ.కోట్లు చేతులు మారే కోడి పందేలు మరో ఎత్తు. పందేలరాయుళ్ల గుట్టు చప్పుడు కాకుండా బరులను సిద్ధం చేస్తుండగా, ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందేలు జరగనివ్వబోమని పోలీసులు తెగేసి చెబుతున్నారు. కొన్నిచోట్ల బరులను ధ్వంసం చేస్తున్నారు. ఈ క్రమంలో కోడి గెలుస్తుందా? లేక లాఠీ గెలుస్తుందా? అనేది మరికొన్ని గంటల్లో తేలనుంది. కోడి పందేల నిర్వహణకు దేవరపల్లి మండలంలోని పలుచోట్ల గ్రామాలకు దూరంగా పొలాల్లో బరులను సిద్ధం చేస్తున్నారు. దేవరపల్లి-యాదవోలు రోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద పామాయిల్ తోటలో బరి ఏర్పాటు చేశారు. దుద్దుకూరు, బందపురం, కురుకూరు, త్యాజంపూడి, ధుమంతునిగూడెం, యర్నగూడెం, సంగాయగూడెం గ్రామాల్లో ఇప్పటికే బరులు సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం 11 గంటల తర్వాత పందేలు జరుగుతాయని నిర్వాహకులు చెపుతున్నారు. కాగా మండలంలో ఇంతవరకూ కోడి పందేలు నిర్వహించే 90 మందిని బైండోవర్ చేశామని స్థానిక ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.



తాళ్లపూడి మండలం గజ్జరంలో సిద్ధం చేసిన కోడిపందేల బరి

నిడదవోలు మండలంలో ఏడుచోట్ల..

నిడదవోలు రూరల్: గ్రామాలకు దూరంగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో పందేల నిర్వహణకు ఇప్పటికే బరులను సిద్ధం చేశారు. విజ్జేశ్వరం, డి.ముప్పవరంలలో మూడు, కాటకోటేశ్వరం, తాడిమళ్ల, కోరుమామిడి తదితర గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు.

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం, పెద్దేవం, తాళ్లపూడి, రావూరుపాడు, తుపాకులగూడెం గ్రామాల్లో బరులను సిద్ధం చేసే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. మండలంలో ఏడు చోట్ల పందేలు జరిగే అవకాశం ఉంది. అయితే పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికే పలువురిని బైండోవర్ చేశామని తాళ్లపూడి ఎస్సై వెంకట రమణ స్పష్టం చేశారు.



ప్రకాశరావుపాలెంలో కోడిపందేల బరిని ధ్వంసం చేయించిన పోలీసులు

చాగల్లు: మండలంలోని మీనానగరం, మల్లవరం, చంద్రవరం, చిక్కాల, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో ఏటా కోడి పందేలు నిర్వహిస్తారు. మిగిలిన గ్రామాల్లో కూడా చిన్న,చిన్న పందేలు జరుగుతాయి. మరోపక్క కోడి పందేలు, జూదాలు జరగకుండా మండలంలోని చిక్కాల, మీనానగరం, చంద్రవరం, ఊనగట్ల, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెంలలో ప్రత్యేక పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్టు చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు.

కోడి పందేల బరుల ధ్వంసం

గోపాలపురం: మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కోడి పందేల బరులకు స్థానిక ఎస్‌ఐ కె.రామకృష్ణ, ఆయన సిబ్బంది గుర్తించి ట్రాక్టర్లతో దున్నించారు. కోడి పందేలు నిర్వహించే 22 మందిని బైండోవర్ చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలో ఏర్పాటు చేసిన బరిని నల్లజర్ల సీఐ లక్ష్మణ్‌రెడ్డి పోలీసు సిబ్బందితో శుక్రవారం సాయంత్రం ధ్వంసం చేయించారు. జూదాలకు స్థలాలు ఇచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కొవ్వూరులో కోడి పందేల నిషేధ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీవో గీతాంజలి

పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

కొవ్వూరు: సంక్రాంతి సంప్రదాయం పేరుతో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కొవ్వూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో కె.గీతాంజలి హెచ్చరించారు. కోడి పందేలు, జూద క్రీడలను వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీని శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోడి పందేలు, జూదాలపై డివిజన్ పరిధిలో నిషేధం ఉందన్నారు. రూరల్ సీఐ వైవీ రమణ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, రూరల్ ఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వస్త్రాల పంపిణీ

కొవ్వూరు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఐ.పంగిడి మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న 22 సిబ్బందికి శుక్రవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.సర్పంచ్ గోశాల నాగర్జున, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, పంచాయతీ కార్యదర్శి దాసరి ముత్యం, మాజీ ఉప సర్పంచ్ తోట దుర్గారావు, ఆత్కూరి ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా నూతన వస్త్రాలు అందజేశారు.

నిడదవోలు రూరల్: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పెండ్యాలను స్వచ్ఛ పల్లెగా తీర్చిదిద్దుతామని ఆ పంచాయతీ సర్పంచ్ కారింకి అన్నవరం అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని పెండ్యాల పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి శుక్రవారం నూతన వస్త్రాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఐ.శివ గణకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఐ.పంగిడి పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగార్జున తదితరులు

మంచు కురుస్తుంటే తక్కువ వేగంతో వెళ్లాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ భీమారావు

- ఎంవీఐ భీమారావు
- వాహనాల డ్రైవర్లకు సూచన
- 'ఆంధ్రా సుగర్స్'లో భద్రతా వారోత్సవాలు

కొవ్వూరు: రోడ్డుపై మంచు కురుస్తునపుడు వాహనాల డ్రైవర్లు లైట్లు వేసుకుని, సాధ్యమైనంత తక్కువ వేగంతో వెళ్లాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) బి.భీమారావు సూచించారు. కొవ్వూరు ఆంధ్రా సుగర్స్ కర్మాగారంలో శుక్రవారం భద్రతా వారోత్సవాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్క డ్రైవర్‌కీ వ్యక్తిగత బీమాతో పాటు వాహనాల ఇన్సూరెన్స్ ఫోర్సులో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ ఈవీ కృష్ణారావు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 17 వరకూ నిర్వహించే జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఫ్యాక్టరీలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రసాయనాలను రవాణా చేసే వాహనాల డ్రైవర్లు వాటి స్వభావంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫ్యాక్టరీ భద్రతా విభాగం ఇన్‌చార్జ్ కేవీవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కార్మికులకు వ్యక్తిగత క్రమశిక్షణ ఆవశ్యకత గురించి వివరించారు. ఆటో ఇంజిన్ వాహనాలను రోజు చెక్ చేసుకోవాలని సూచించారు.అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్‌ఆర్ శుక మహర్షి, కర్మగారంలో పనిచేస్తున్న డ్రైవర్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సప్తవర్ణ శోభితంగా రంగవల్లులు



నిడదవోలులో రంగవల్లులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, న్యాయ నిర్ణేతలు



కొవ్వూరు మండలం వేములూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు

- విజేతలకు నగదు బహుమతుల ప్రదానం
- నిడదవోలులో భారీ ఎత్తున సంక్రాంతి సంబరాలు

నిడదవోలు: ఇంద్రధనస్సు నేలమీదకు దిగి వచ్చిందా?అని భ్రమింపజేసేలా మహిళలు రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. పట్టణంలోని ఎన్‌సీఎన్ కార్యాలయం వద్ద శుక్రవారం భారీ ఎత్తున రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఎన్‌సీఎన్ చానల్, స్వాతి ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం సంయుక్తంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించాయి. మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ భోగి మంట వెలిగించి ఈ సంబరాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 125 మంది మహిళలు హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో మొదటి స్థానంలో నిలచిన ఎన్.భానుకు రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన జి.శిరీషకు రూ.7,500, తృతీయస్థానం పొందిన టి. భవానీకి రూ.5000 నగదు బహుమతులను మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కౌన్సిలర్ చిలకల శారదాదేవి, మానేపల్లి కల్యాణి, ఆకుల సూర్యకుమారి వ్యవహరించారు. ఈ సందర్భంగా తణుకు పట్టణానికి చెందిన చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎన్‌సీఎన్ చానల్ అధినేత నీలం నాగేంద్రప్రసాద్, కౌన్సిలర్లు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

కొవ్వూరు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేములూరులోని కోదండ రామాలయం సెంటర్ వద్ద శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వివిధ రకాల ఆకృతుల్లో వేసి ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. పంచాయతీ సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కొటికలపూడి అబ్రహం లింకన్, తోట శివ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ప్రవీణ్ ఫాంటస్ జట్టు

- ద్వితీయ స్థానంలో కురుకూరు జట్టు
- విజేతలకు ఈ నెల 17న నగదు బహుమతుల ప్రదానం



విజేత ప్రవీణ్ ఫాంటస్ జట్టు

గోపాలపురం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని వేళ్లచింతలగూడెంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రవీణ్ ఫాంటస్ జట్టు గెలుచుకుంది. ఘంటా రంగారావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం నిర్వహించిన ఫైనల్స్‌లో ప్రవీణ్ ఫాంటస్ జట్టు, దేవరపల్లి మండలం కురుకూరు జట్టు హోరా హోరీగా తలపడ్డాయి. 11 పరుగుల తేడాతో వేళ్లచింతలగూడేనికే చెందిన ప్రవీణ్ ఫాంటస్ జట్టు విజేతగా నిలిచింది. కురుకూరు జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. జంగారెడ్డిగూడెం జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ప్రథమ బహుమతిగా రూ.లక్షా 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ 75 వేలు, తృతీయ బహుమతిగా రూ.30 వేలు ప్రకటించారు. విజేతలకు ఈ నెల 17న ఈ బహుమతులు అందజేస్తారు. మొత్తం 32 టీమ్‌లు పాల్గొన్నట్టు ఫౌండేషన్ చైర్మన్ ఘంటా మధుకృష్ణ తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యులు పిన్నమనేని వెంకటరత్నం, కొర్లపాటి శ్రీరామచంద్రరావు, కొర్లపాటి రాజా, దుగ్గిరాల గోపాలకృష్ణ క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముగ్గుల పోటీలు

సంక్రాంతి సందర్భంగా వేళ్లచింతలగూడెంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రథమ బహుమతిగా కాసు, ద్వితీయ బహుమతిగా అరకాసు బంగారం, తృతీయ బహుతిగా రూ.20 వేల నగదు అందజేస్తారు.

ఆయిల్‌పామ్‌లో అంతర పంటలతో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో కమల్‌రాజ్

ఏపీ పేపర్ మిల్లు మేనేజర్ వీరబాబు

నల్లజర్ల: ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా సుబాబుల్, సరుగుడు వేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని రాజమహేంద్రవరం ఏపీ పేపర్ మిల్లు మేనేజర్ వీరబాబు సూచించారు.రైతు సలహా మండలి సమావేశాన్ని మండలి అధ్యక్షుడు తాడిగడప శ్రీనివాసరావు అధ్యక్షతన ఆవపాడు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరబాబు మాట్లాడుతూ ఎకరానికి వెయ్యి మొక్కలు నాటుకుంటే కేవలం 18 నెలల్ల పంట కోతకు వస్తుందన్నారు. రైతుకు దాదాపు రూ.లక్షన్నర ఆదాయం వస్తుందన్నారు. ఒక్కో మొక్క రూ.4 కాగా, ప్రభుత్వం రూ.1.50 సబ్సిడీగా అందిస్తోందన్నారు. తడి,పొడి వ్యవసాయంపై ఎన్‌జీఓ ప్రకాష్ రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. డ్రిప్, స్ప్రింక్లర్లు, వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, తహసీల్దార్ మక్సూద్ ఆలీ, సీఐ లక్ష్మణరెడ్డి, ఏవో కె.కమల్‌రాజ్, ఉద్యానశాఖాధికారి శ్రీలక్ష్మి, పశుసంవర్ధక శాఖ ఏడీ మోజెస్ వెస్లీ, పశుసంవర్ధక శాఖ సహాయకుడు రాజ్‌కుమార్ కండెల్లి, మండల స్థాయి వ్యవసాయ అనుబంధ అధికారులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు



గోపాలపురం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..



వేగేశ్వరపురం సచివాలయం వద్ద ..

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం సచివాలయం వద్ద ఆ పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డూడూ బసవన్నల ప్రదర్శన, హరిదాసుల కీర్తనలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. మహిళా ఉద్యోగులు రంగు రంగుల ముగ్గుల వేయగా, పురుషులు భోగి మంట వేశారు. అనంతరం పాయసం తయారు చేశారు. కార్యక్రమంలో పంచాతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు శీర్ల బ్రహ్మానందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

గోపాలపురం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కల్యాణ మండపం ఆవరణలో మహిళలు రకరకాల రంగవల్లులను తీర్చిదిద్దారు. గంగిరెద్దులు, హరిదాసు,జంగం దేవరులతో సంబరాలు నిర్వహించారు. వాసవీమాతకు పూజలు చేశారు.వాసవీ క్లబ్ సభ్యులు మద్దు కోకిల, సుమిత్ర, సుతాపల్లి సత్యసాయి సునీత, మీనాక్షి పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న రాజేంద్రబాబు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంకు చెందిన మృతుడు బీరాబత్తుల వీరన్న కుటుంబ సభ్యులకు 3 ఎఫ్ ఆయిల్ ఫ్యాక్టరీ ద్వారా రూ.5 లక్షల బీమా చెక్కు విడుదల అయ్యింది. ఈ చెక్కున పామాయిల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ బొంతా భరత్‌బాబు చేతుల మీదుగా శుక్రవారం మృతుడి భార్యకు అందజేశారు. వీరన్న గతేడాది పామాయిల్ గెలలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. మృతుడి భార్య శేషమణికి బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జీఎం విజయప్రసాద్, రైతులు పాల్గొన్నారు.